# బొర్రా చలమయ్యని పరామర్శించిన
## పెడన ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్



**ముదినేపల్లి మే 6 (ప్రభాతవార్త)** ఏ లిటిల్ ఫ్లవర్ స్కూల్స్ అధినేత,టిడిపి నాయకులు బొర్రా చలమయ్య తండ్రి శాయరాజు ఇటీవల అనారోగ్యంతో కాలం చేశారు.విషయం తెలుసుకున్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ బుధవారం ముదినేపల్లి మండలం పెనుమల్లి గ్రామం ఆయన స్వగృహానికి వెళ్లి బొర్రా చలమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.ముందుగా ఎమ్మెల్యే ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం నేతలు పరసా ఏడుకొండలు, కైకలూరు నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షులు పోలగాని నాగరాజు ,బొర్రా కాశి,కట్టా రాఘవులు,కట్టా గోపి ల,బొర్రా శేషు గారు,శౌంరి నాగరాజు,మరీదు నాగరాజు,బసవయ్య,అనగాని కోటయ్య,తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి
### ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, పెదవేగి డిపిటీసీ చీఫ్ లా ఇన్స్ట్రక్టర్ (సిఎల్ఐ) ఆకుల రఘు




**తాడేపల్లిగూడెం మే 6 (ప్రభాతవార్త )** సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, పెదవేగి డిపిటీసీ చీఫ్ లా ఇన్స్ట్రక్టర్ (సిఎల్ఐ) ఆకుల రఘు సూచించారు. భారత ప్రభుత్వ ఆదేశాలమేరకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్) లోని వెబ్, నెట్ వర్క్, టెలీ సర్వీసెస్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ జాగరూక్త దివాస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన, అసోసియేట్ డీన్ డాక్టర్ పులి కిషోర్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధి ఆకుల రఘు మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. చరవాణిలకు వచ్చే తెలియని సందేశాలు, లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదని చెప్పారు. పొరపాటున వాటిపై క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలోని సొమ్ములు, విలువైన డేటాను చోరీ చేస్తున్నారని చెప్పారు. మోసాలకు ఎటువంటి అవకాశం ఇవ్వకుండా మనల్ని మనమే రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కంప్యూటర్ పాస్వర్డ్ లను క్రమం తప్పకుండా మార్చుకోవాలని సూచించారు. వ్యక్తిగత సమాచారాన్ని ఆర్థిక సమాచారాన్ని ఆన్లైన్లో పంచుకోకూడదన్నారు. మనకు తెలియని వై -ఫై నెట్ వర్క్, హాట్ స్పాట్ లను వినియోగించకూడదని తెలిపారు. ఒకవేళ ఎవరైనా పొరపాటున లింక్ పై క్లిక్ చేసి డబ్బులు పోగొట్టుకుంటే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని వివరించారు. ఏపీ నిట్ డీన్ అండ్ ప్లానింగ్ డాక్టర్ వి.సందీప్ మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా వినియోగించుకునేలా యువతకు దిశానిర్దేశం చేయాలని వివరించారు. అనంతరం డాక్టర్ సందీప్ ముఖ్య అతిధి ఆకుల రఘును శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ హిమబిందు, డాక్టర్ శ్రీ ఫణి కృష్ణ కర్రి, డాక్టర్ గుర్రాల కిరణ్ కుమార్, డాక్టర్ శీనివాసన్, వెబ్ నెట్ వర్క్ సూపర్వైజర్లు ఆనంద్, చైతన్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధితో పేదల ఆరోగ్యాన్ని
# మెరుగుపరుస్తున్నాం
### ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం: మే 6 (ప్రభాత వార్త )** వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయనిధిని సకాలంలో అందజేసి, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని తొమ్మిదో వార్డుకు చెందిన జ్ఞానేశ్ కు రూ.5 లక్షలు విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ జ్ఞానేశ్ మెదడుకు ఆపరేషన్ నిమిత్తం వైద్య ఖర్చును త్వరితంగా ఇప్పించేందుకు కృషి చేశామని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ రాష్ట్రానికి చేస్తున్న అభివృద్ధి వెలకట్టలేనిదని, ప్రధానమంత్రి మోదీ సహాయంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. నియోజకవర్గంలో ఎంతోమంది పేదలకు సీఎం సహాయ నిధి నుంచి రూ కోట్లాది రూపాయలు అందించి పేదవారి ఆరోగ్యం మెరుగుపరిచామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో రాష్ట్ర సచివాలయంలోని వివిధ విభాగాల ఉద్యోగులను సంప్రదించి బాధితులకు వేగంగా సహాయం అందే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. వైద్య సహాయం విషయంలో పేదవారికి నిరంతరం సహాయం చేస్తూనే ఉంటామని, గత రెండేళ్లలో సుమారు రూ. 7 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధిని బాధితులకు అందించామని వివరించారు. వైద్య సహాయం కోసం ఎవరైనా మా కార్యాలయంలో సంప్రదించవచ్చని,వారికి సకాలంలో సహాయం అందే విధంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. జ్ఞానేశ్ కు సకాలంలో వైద్య సహాయం కోసం కృషిచేసిన జనసేన నాయకుడు నలగంచు రాంబాబుకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో వర్తనపల్లి కాశి, అడపా ప్రసాద్, అడ్డగర్ల సూరి, కూటమి పాల్గొన్నారు.

# లేఖరి ఆంజనేయులు కన్నుమూత



**నరసాపురం మే 6 ప్రభాతవార్త** దస్తావేజుల లేఖరి నర్సాపురం దస్తావేజులు లేఖర్ల సంఘానికి పలు పదవులు చేసిన తిల్లపూడి కరణంగా పిలవబడే నడుపల్లి వెంకట సీతారామాంజనేయులు 67 గత రాత్రి కన్నుమూశారు. లేఖరి వృత్తిలో నిష్ణాతుడిగా పేరు పడ్డ ఆంజనేయులు గత కొంతకాలంగా గొంతు క్యాన్సర్ తో ఇబ్బంది పడుతున్నారు. వ్యాధి తగ్గిపోయిందిలే అనుకునే సమయంలో ఆయన తనువు చాలించారు. ఆయనకు భార్య కుమారుడు ఉన్నారు. పేరాల మోహన్ దేవి మాస్టారు టీవీ రమణ కటకం శెట్టి రామచంద్రరావు గంధం రవి రామారావు తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించి ఆయన వృత్తి నైపుణ్యాన్ని వివరించారు. నరసాపురం సబ్ రిజిస్టర్ ఆఫీస్ సిబ్బంది ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు.

## నేడు జంగారెడ్డిగూడెం పట్టణంలో విద్యుత్ నిలిపివేత



**జంగారెడ్డిగూడెం మే 6 ప్రభాతవార్త** ?జంగారెడ్డిగూడెం పట్టణంలోని మెట్ట సబ్ స్టేషన్ పరిధిలో గల టౌన్ ఫీడర్ విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనుల దృష్ట్యా నేడు (07-05-2026) విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 01:30 గంటల వరకు టీచర్స్ కాలనీ, సాలిపేట, కాలేజీ రోడ్డు, జె పి సెంటర్, శ్రీనివాసపురం రోడ్డు పరిసర ప్రాంతాల్లో అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. మరమ్మత్తు పనుల దృష్ట్యా వినియోగదారులు సహకరించాలని కోరారు.

# గుత్తేదారుని అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలి
### అఖిలభారత ఆదివాసి వేదిక.



**బుట్టాయగూడెం. మే 6 (ప్రభాత వార్త)** రెండు దశాబ్దాలుగా గిరిజన సంక్షేమ వసతి గ్రహాలకు సరుకుల గుత్తేదారుడి అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని అఖిలభారత ఆదివాసి వేదిక జాతీయ కన్వీనర్ సరియం రామ్మోహన్ డిమాండ్ చేశారు. స్థానిక పత్రికలకు బుధవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో కోట రామచంద్రపురం సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ వసతి గృహాలకు గుత్తేదారుడు నాసిరకం కూరగాయలు, పాలు, కోడి మాంసం, స్నా క్స్ పంపిణీ చేస్తూ తీవ్ర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. వసతి గృహాలకు సరుకుల పంపిణీ పై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల గుత్తేదారుడు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని అన్నారు. విద్యార్థులకు ఇవ్వవలసిన మెనూకు సంబంధించిన ఆహార పదార్థాల సరఫరాలో జరిగిన అవినీతిపై అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్, సి బి సి ఐ డి ద్వారా సమగ్ర విచారణ చేస్తే వాస్తవాలు బయటపడతాయని చెప్పారు. వాస్తవాలను వెలికి తీసి బాధ్యులపై అధికారులు చర్యలు తీసుకోవాలని రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కోట రామచంద్రపురం, ఐటిడిఎ గిరిజన దర్బార్ లో ప్రాజెక్టు ఆఫీసర్ కు వినతి పత్రం అందించినట్లు చెప్పారు. సుమారు 20 సంవత్సరాల కాలం నుండి గుత్తేదారుని ఆర్థిక లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నూతన టెండర్ల సమయంలో అవినీతిపరుడైన గుత్తేదారుని ఏజెన్సీ( సంస్థ) ను నిషేధ జాబితాలో ఉంచాలని అన్నారు. గుత్తేదారిని వ్యవహారాలపై జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి లోకేష్ లకు ఫిర్యాదు చేయనున్నట్లు రామ్మోహన్ తెలిపారు.

## పాదచారులకు బత్తాయి రసం పంపిణీ చేసిన
# జనసేన నాయకులు పైబోయిన వెంకట రామయ్య




**తాడేపల్లిగూడెం మే 6 (ప్రభాతవార్త)** తాడేపల్లిగూడెం పట్టణంలోని ఏపీ నిట్ ప్రధాన ముఖ ద్వారం ఎదురుగా ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం పైబోయిన వెంకట రామయ్య (పివిఆర్) యూత్ ఆధ్వర్యంలో బుధవారం పాదచారులకు బత్తాయి రసం పంపిణీ చేశారు. సుమారు 150 లీటర్ల బత్తాయి రసాన్ని పాదచారులకు నిట్ విద్యార్థులకు సమీపంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు పైబోయిన వెంకట రామయ్య మాట్లాడుతూ దేశభద్రతకు ముప్పుగా పరిగణించిన పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ ని మట్టికరిపించి బిజెపి విజయం సాధించిన ఆనందోత్సాహాలతో ఈ బత్తాయి రసం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పాలనాదక్షితను మెచ్చి బెంగాల్ ప్రజలు భాజాపాకు పట్టం కట్టారని కొనియాడారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సేవా గుణాన్ని తాము పుణికిపుచ్చుకుని మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పైబోయిన నిఖిల్ సాయి ( బన్నీ) కర్రి సురేష్, షేక్ పఠాన్ వలి, ఎర్ర సతీష్, సూరిశెట్టి ప్రసాద్, సాయి, విప్పర్తి శామ్యూల్, సునీల్, భీమవరం కృష్ణ, మైలవరపు సోమరాజు, మాదాసు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన వైఎస్ జగన్



**జంగారెడ్డిగూడెం మే 6 ప్రభాతవార్త** జంగారెడ్డిగూడెం గూడపాటి రాధాకృష్ణ కుమార్తె వివాహ వేడుకను పురస్కరించుకుని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. గత నెల 26న మృదుల - విశ్వతేజల వివాహం ఘనంగా జరిగింది. ఈ వివాహ పత్రికను స్వీకరించిన జగన్మోహన్ రెడ్డి, తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయం నుండి వధూవరులకు దివ్య ఆశీస్సులు అందజేస్తూ ప్రకటన విడుదల చేశారు. ?తన కుమార్తె వివాహానికి శుభాశీస్సులు అందజేసిన జగన్మోహన్ రెడ్డికి వైఎస్ఆర్సిపి మాజీ మండల అధ్యక్షుడు, సొసైటీ మాజీ చైర్మన్ గూడపాటి రాధాకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యుడు ముప్పిడి శ్రీనివాసరావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కొయ్య లీలాధర్ రెడ్డి, తొమ్మిదవ వార్డు అధ్యక్షుడు బోను ప్రసాద్, కాకినాడ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు

## వేదాంతపురంలో రేపు 'ఒక నెల -- ఒక గ్రామం' కార్యక్రమం



**కొయ్యలగూడెం మే 06 ప్రభాత వార్త** ప్రజా సమస్యల సమర్థవంతమైన పరిష్కారమే ధ్యేయంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు మండలంలోని వేదాంతపురం గ్రామంలో గురువారం 'ఒక నెల -- ఒక గ్రామం -- నాలుగు సందర్శనలు' కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలోని భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ వేదికను వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా రీ-సర్వే సమస్యలు, మ్యుటేషన్లు, అడంగల్ సవరణలు, సరిహద్దు వివాదాలు, భూ ఆక్రమణలు, కుటుంబ భూ తగాదాలు మరియు జీవో నెం.30 కింద రెగ్యులరైజేషన్ వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివోతో పాటు రెవెన్యూ ఇన్స్పెక్టర్, ఇరిగేషన్, ఎండోమెంట్ శాఖల అధికారులు, వీఆర్వోలు పాల్గొంటారని వివరించారు. వేదాంతపురం గ్రామ ప్రజలు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహశీల్దార్ కోరారు.

## పట్టెనపాలెంలో వన్ మంత్ -- వన్ విలేజ్
# ఫోర్ విజిట్స్' కార్యక్రమం ప్రారంభం



**జంగారెడ్డిగూడెం మే 06 ప్రభాతవార్త** ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలోని పట్టెనపాలెం రెవెన్యూ గ్రామంలో ప్రజల భూ సమస్యల పరిష్కారం కోసం 'వన్ మంత్ -- వన్ విలేజ్ -- ఫోర్ విజిట్స్' కార్యక్రమం ప్రారంభం కానుంది. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సి సి ఎల్ ఏ) మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ప్రజల ఫిర్యాదులను గ్రామ స్థాయిలోనే పారదర్శకంగా, నిర్ణీత కాలంలో పరిష్కరించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమం ప్రతి నెల నాలుగు దశల్లో నిర్వహించబడుతుంది. మొదటి గురువారం ఫిర్యాదుల నమోదు, రెండవ గురువారం క్షేత్రస్థాయి విచారణ, మూడవ గురువారం సమస్యల పరిష్కారం మరియు ఉత్తర్వుల జారీ, నాలుగవ గురువారం గ్రామ సభ నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తారు. రీ-సర్వే సమస్యలు, మ్యూటేషన్లు, అడంగల్ సవరణలు, భూ ఆక్రమణలు, సరిహద్దు వివాదాలు మరియు నోషనల్ ఖాతా మార్పుల వంటి రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపీడీఓ, మండల సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వోలతో పాటు ఇరిగేషన్, ఫారెస్ట్, ఎండోమెంట్ శాఖల అధికారులు పాల్గొంటారు. స్వీకరించిన ప్రతి ఫిర్యాదును అదే రోజు పీజీఆర్ఎస్ పోర్టల్లో నమోదు చేసి, పారదర్శక పద్ధతిలో పరిష్కరిస్తామని తహశీల్దార్ తెలిపారు. పట్టెనపాలెం గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మైక్రో ఫిల్టర్ ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు



**కాళ్ల మే 6 (ప్రభతవార్త)** నియోజకవర్గంలో అన్ని గ్రామాల ప్రజలకు సురక్షిత అందించాలన్న ధ్యేయంతో దాతల సహకారంతో మైక్రో ఫిల్టర్లను ఏర్పాటు చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ ఉండి ఎమ్మెల్యే రఘు రామకృష్ణంరాజు అన్నారు. మండలంలోని పల్లెపాలెంలో కెనరా బ్యాంక్ సహకారంతో ఏర్పాటుచేసిన మైక్రో ఫిల్టర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ మైక్రో ఫిల్టర్ కనెక్షన్లు, బెడ్ ఏర్పాటుకు సహకారం అందించిన మంతెన పెద నరసింహారాజు, ఏ.పి.ఐ.ఐ.సి. చైర్మన్ మంతెన రామరాజులు (రాంబాబు) అభినందనీయులన్నారు. ఏ.పి. ఐ.ఐ.సి. చైర్మన్ రామరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోనూ దాతల సహకారంతో మైక్రో ఫిల్టర్లను ఏర్పాటు చేస్తున్న రఘురాం కృష్ణంరాజు అభినందనీయులు అన్నారు. ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించాలని కృషి చేస్తున్న రఘురామ కృష్ణంరాజు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మంతెన పెద నరసింహారాజు, మంతెన వేణుగోపాలరాజు, మంతెన చిన నరసింహారాజు,

## జాతీయ స్థాయి ఉత్తమ సర్పంచ్ కాపా శ్రీనివాసరావుకు సత్కారం



**నూజివీడు, మే 06 ప్రభాతవార్త =** జాతీయస్థాయి ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్న రావిచెర్ల సర్పంచ్ కాపా శ్రీనివాసరావుకు బుధవారం నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో అభినందన సమావేశం నిర్వహించబడింది. గ్రామ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు గ్రామాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన సర్పంచ్ కాపా శ్రీనివాసరావు చేసిన కృషికి నిజమైన గుర్తింపు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తమ సర్పంచ్ అవార్డు ప్రామాణికమని వక్తలు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత నూజివీడు మాజీ ఏఎంసి చైర్మన్, రావిచెర్ల సర్పంచ్ శ్రీనివాసరావును నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి గ్రామంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతాంగ సమస్యల పరిష్కారంలో రైతులకు మార్గదర్శి గా వ్యవహరించిన కాపా శ్రీనివాసరావు పనిచేయడంతో పాటు ఆయన సొంత గ్రామం రావిచెర్లకు సర్పంచ్ గా పనిచేసే గ్రామాన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడంతోపాటు ప్రజలకు మౌలిక సదుపాయాలను అందించారు అన్నారు. ఈ క్రమంలో ఎంతమంది నాయకులకు మార్గదర్శకంగా ఉన్నారన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అనేక పంచాయతీలలో రావిచెర్లను ప్రథమ స్థానంలో నిలపడం లో కాపా శ్రీనివాసరావు కృషి ఎంతో ఉందన్నారు.గ్రామ మాజీ సర్పంచ్ అక్కినేని చందు, పిఎసిఎస్ చైర్మన్ అక్కినేని బెనర్జీ, కొమ్మన నాగేశ్వరరావు,టిడిపి నాయకులు అన్నే నాని,గ్రామ టిడిపి అధ్యక్షులు సుంకర బాబీ, అక్కినేని జయకృష్ణ, అక్కినేని ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# జంగారెడ్డిగూడెంలో ఘనంగా
# జిల్లా స్థాయి చదరంగ పోటీలు



**జంగారెడ్డిగూడెం మే 06 ప్రభాతవార్త** ఇండియన్ డిజిటల్ స్కూల్లో నిర్వహించిన ఏలూరు జిల్లా స్థాయి అండర్-11 ఓపెన్ మరియు గర్ల్స్ చదరంగ పోటీలు ఉత్సాహభరితంగా ముగిశాయి. చెస్ డెవలప్మెంట్ అండ్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆఫ్ ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో జిల్లా నలుమూలల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. ?ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలు ఈ నెల 9, 10 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్-11 ఛాంపియన్షిప్లో ఏలూరు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇండియన్ డిజిటల్ స్కూల్ యాజమాన్యం శివ మాట్లాడుతూ, చెస్ మేధో వికాసానికి గొప్ప సాధనమని, అధిక ఐక్యూ స్థాయిలు కలిగి ఉండటం వల్ల విద్యార్థులు సమాజంలో ప్రత్యేక వ్యక్తులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణిస్తున్న వారిలో చెస్ నేపథ్యం ఉన్నవారు ఎక్కువగా ఉండటం గర్వకారణమని అభిప్రాయపడ్డారు.

**పోటీల ఫలితాలు:**

బాలుర విభాగంలో జ్యోతి స్వరూప్ మొదటి స్థానం సాధించగా, హరి విహాన్ రెండవ స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో ధరణి ప్రథమ స్థానం, బిస్మి యాస్మిన్ జారా ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నట్లు టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ పాలూరి కిరణ్ కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోచ్ మహేష్, ఏలూరు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ పాలూరి, కార్యదర్శి కన్నా సూర్య నాగేశ్వరరావు, స్కూల్ ప్రతినిధులు మరియు క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రీ సర్వేపై జాయింట్ కలెక్టర్ సమీక్ష



**అత్తిలి, మే 6,( ప్రభాత వార్త )**అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో డ్రాఫ్ట్ పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, రీ-సర్వే పురోగతి పై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్తిలి మండలంలో రీ-సర్వే పనులు విజయవంతంగా పూర్తి కావడం అభినందనీయమని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో రీ-సర్వే 100 శాతం పూర్తై, జిల్లాలో అత్తిలి మండలం మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. అత్తిలి గ్రామంలో రీ-సర్వే పూర్తయిన నేపథ్యంలో రైతులకు పంపిణీ చేస్తున్న డ్రాఫ్ట్ పట్టాదారు పాస్ పుస్తకాలలో ఏవైనా తప్పులు ఉంటే వాటిని జాగ్రత్తగా పరిశీలించి వెంటనే తెలియజేయాలని రైతులను కోరారు. అత్తిలి, గుమ్మంపాడు గ్రామాలలో గృహ గణన నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించిన జాయింట్ కలెక్టర్, ఎన్యూమరేటర్లతో మాట్లాడి మార్గదర్శకాలు అందించారు. గృహ గణన యాప్లో స్వయంగా కొన్ని ఇళ్ల వివరాలను నమోదు చేసి, ప్రక్రియలో ఖచ్చితత్వం ఎంత ముఖ్యమో వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు, నివాస పరిస్థితులు, ప్రాథమిక సౌకర్యాలు తదితర అంశాలను పూర్తిగా, సరైన విధంగా నమోదు చేయాలని సూచించారు. డేటా సేకరణలో ఎటువంటి పొరపాట్లు లేకుండా సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గుమ్మంపాడు గ్రామంలో సుమారు 100 సంవత్సరాల క్రితం చెరువు పోరంబోకు భూమిలో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారి పరిస్థితులను పరిశీలించి, సంబంధిత వివరాలను తెలుసుకున్నారు. ఈ అంశంపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. అదేవిధంగా మండలంలోని రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మేరకు గోనె సంచులు సరఫరా చేయాలని రైస్ మిల్లర్లను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహసీల్దార్ దశిక వంశీ, రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రతిభావంతులకు పురస్కారాలు..

**కాళ్ళ మే6(ప్రభాతవార్త)** ప్రతిభావంతులైన విద్యార్థులను యూటీఎఫ్ మండల శాఖ సత్కరించడం అభినందనీయమని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, జిల్లా విద్యాశాఖ అధికారి జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.వి.వి.ఎస్.ఎస్.ఎన్.బి.ఎల్. నారాయణ అన్నారు. మండలంలోని కోపల్లె జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను, ప్రతి ఉన్నత పాఠశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన 19 మందిని సత్కరించారు. ఏ ఎం ఓ సి.హెచ్.చంద్రశేఖర్, ఎంఈఓ 2 పి.ఏసుదాసు, రిటైర్డ్ ఎంఈఓ2 జి.కనకరాజు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పివిఎస్ విజయరామరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జివివి రామానుజరావు, జిల్లా కార్యదర్శి,మండల ఇంచార్జ్ జి. రామకృష్ణంరాజు, జిల్లా కార్యదర్శి కుమార బాబ్జి, మండల నాయకులు రవికుమార్ రాజు, రవిచంద్ర కుమార్, బిఆర్ఎంకే స్వామి, ఎమ్ శంకర్రావు, బాలబాలాజీ, ఎన్. తిరుమలరావు,



ఎం ఎన్ సి హెచ్ ఎస్ వర్మ, డి కనకదుర్గ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పెదవాగు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని సంతకాల సేకరణ



**వేలేరుపాడు, మే 6 (ప్రభాత వార్త) :** గ్రామాలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు పెదవాగు ప్రాజెక్టు నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపందా ఏలూరు జిల్లా కమిటీ పిలుపుమేరకు వేలేరుపాడు మండలం సొందెగొల్లగూడెం గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమం లో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు పాల్గొని మాట్లాడుతూ,రెండు సంవత్సరాల క్రితం ప్రాజెక్టు గండిపడటంతో నీటి సరఫరా నిలిచిపోయి పంటలు ఎండిపోయాయని తెలిపారు. దీంతో రైతులు తీవ్ర అప్పుల్లో కూరుకుపోయి వ్యవసాయానికి దూరమవుతున్నారని అన్నారు.అలాగే కమ్మరిగూడెం,బండలబోరు, వసంతవాడ,రామవరం, విప్పలగుంపు వంటి గ్రామాలకు పెదవాగు నీరే ప్రధాన తాగునీటి వనరని తెలిపారు.వాగుఎండిపోవతో అల్లూరి నగర్, కోయమాధవరం,రెడ్డిగూడెం, సొందెగొల్లగూడెం గ్రామాల్లో ఇప్పటికీ నీటి సమస్య కొనసాగుతోందన్నారు. ఇప్పటికైనా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చి ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సొందెగొల్లగూడెం గ్రామ ప్రజలు సంతకాలు చేశారు. సౌందర్య,దుర్గయ్య,లంకపల్లి శివ,వెంకటేష్,శూన్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

### మంచి దిగుబడులతో ఆకట్టుకుంటున్న
## యంటియు-1443 వరి రకం,
### డా.శ్రీనివాస్



**పెనుమంట్ర, మే-06, (ప్రభాతవార్త)** రైతు స్థాయిలో మంచి ఫలితాలు ఇస్తున్న యంటియు-1443 అనే వరి రకాన్ని ఈ సం. రం రూపకల్పన చేసినట్లు మండలంలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహా పరిశోధనా సంచాలకులు డా.టి.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఈ రకం ప్రస్తుతం మొదటి సంవత్సర చిరుసంచి పరిశీలనలో ఉన్నదని తెలిపారు. ఆచంట మండలం, పడమటిపాలెం గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు నెక్కంటి రామకృష్ణ తన ఎకరం పొలంలో ఈ రకాన్ని సాగుచేశారన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశధనా స్థానం శాస్త్రవేత్తలు డా.ఎం.గిరిజా రాణి, బాబు, డా.యం.వి.కృష్ణాజీలు ఈ రకాన్ని పరిశీలించి మంచి దిగుబడి రావొచ్చని ఆశాభావం వ్యక్తం చేసారు. నూతన రకాన్ని సాగుచేసిన రైతు తన మాటలలో సార్వా లో 140 రోజులు, దాళ్వా లో సుమారుగా 125 రోజుల పంటకాలం తీసుకున్నదని, గింజ యంటియు-1061 రకాన్ని పోలి ఉన్నదని తెలిపారు. తను ఈ రకం సాగు చేసిన పొలం కొంచెం పాల చౌడు ఉన్నప్పటికీ, పంట బాగానే వచ్చిందని తెలిపారు. ఎకరాకు సుమారు 55 -- 60 బస్తాల దిగుబడి రావొచ్చని ఆశాభావం వ్యక్తంచేసారు. చేను పడిపోలేదని, సగటున దుబ్బుకు 20--25 వరకు పిలకలు చేసి, చిక్కటి కంకి కలిగి ఉన్నదని తెలిపారు. మదమతాలు లేకుండా కంకి పూర్తిగా పాలుపోసుకొని పూర్తి నిండు గింజలు కలిగి ఉన్నదని తెలిపారు. దోమపోటు గానీ, బాక్టీరియా ఎండాకు తెగులు గానీ ఆశించలేదని తెలిపారు. ఎరువులు తక్కువగా తీసుకున్నదని తెలిపారు. స్వర్ణ సబ్ 1 రకాన్ని ఉపయోగించి తయారుచేసిన ఈ రకం గింజ దశలోను (విత్తిన 15 రోజుల నుండి) మరియు పిలక దశలోనూ రెండు వారాల పాటు తాత్కాలిక ముంపు తట్టుకుంటుందని తెలిపారు. నేల లో లవణ సాంద్రత 4 నుండి 8 డిఎస్/మి వరకు తట్టుకొని మంచి దిగుబడి ఇస్తుందని తెలిపారు. గింజ మధ్యస్థ సన్నంగా ఉండి సాధారణ పరిస్థితిలో హెక్టారుకు 7.3 టన్నుల వరకు దిగుబడి ఇస్తుందని, ఆకులు స్వర్ణ రకంలా ముదురాకుపచ్చగా ఉండడం వల్ల, తక్కువ నత్రజనితో పంట పండుతుందని తెలిపారు. నూతనంగా సాగుచేసిన యంటియు-1443 చిరుసంచి రకానికి ప్రతి చోట నుండి సానుకూల స్పందన వస్తున్నదని తెలియజేశారు.

## బల్లిపాడు లో కంటి వైద్య శిబిరం



**అత్తిలి, మే 6( ప్రభాత వార్త** )తణుకు శాసనసభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.
నిపుణులైన వైద్యుల చేత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు,కళ్లద్దాలు అందజేసారు . ప్రతి ఒక్కరూ తమ కంటి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, ఇటువంటి వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 89 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.బల్లిపాడు గ్రామ టీడీపీ అధ్యక్షులు గారపాటి అశోక్, జనసేన అధ్యక్షులు ఆకుల రాంచంద్రావు దేవస్థానం చైర్మన్ గారపాటి బాబ్జి ఏ ఎం సి డైరెక్టర్ రాచపోతు వెంకట సత్యవతి, చంటి, గునుపూడి నరేష్ తదితరులు పాల్గొన్నారు

## ఆలయ ముఖ మండపంపై అమ్మవారి అవతారాల విగ్రహాలు



**భీమవరం మే 6 ప్రభాతవార్త**
భీమవరం మెంటే వారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారి ముఖ మండపంపై అమ్మవారి అవతారాల విగ్రహాలను అలంకరించారు. పట్టణానికి చెందిన గ్రంధి చల్లారావు, రాధిక దంపతుల సహకారంతో బుధవారం అమ్మవారి ముఖ మండపంపై అమ్మవారి అవతారాల విగ్రహాలకు పూజలు చేసి అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి దాతలకు ఆశీర్వచనాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

## పర్వతారోహణ చేసిన వాణి కి సత్కారం



**భీమవరం మే 6 ప్రభాతవార్త**
నేపాల్ ఎవరెస్టు బేస్ క్యాంప్ లో 6000 మీటర్ల పర్వతారోహణ చేసి భీమవరం విచ్చేసిన గొట్టుముక్కల వాణి కి బుధవారం శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో యూత్ హాస్టల్స్ అసోసియేషన్ సభ్యులు స్వాగతం పలికారు. పర్వతారోహణ చేయటం చాలా సాహసకృత్యమని, ఈ విధమైన సాహసోపేత కార్యక్రమం చేయడం మహిళాలోకానికే గర్వాకారణమని యూత్ హాస్టల్స్ అసోసియేషన్ చెరుకువాడ రంగసాయి, కటికిరెడ్డి వెంకటరత్నం, నందమూరి రాజేష్ అన్నారు. గొట్టుముక్కల వాణి 64 ఏళ్ల వయస్సులో ఈ సహాయ యాత్ర చేయటం గొప్పవిశేషమన్నారు. వాణి 15 రోజులపాటు మైనస్ డిగ్రీ వాతావణంలో నేపాల్ దేశంలో ఎవరెస్టు బేస్ క్యాంప్ ప్రారంబించి పర్వతాన్ని అదిరోహించి నేడు స్వదేశానికి రావటం గొప్పవిశేషమన్నారు. కార్యక్రమంలో జానపాటి మధుసూదన రావు, తాళ్ళపూడి గాంధీ, పేరిచర్ల లక్ష్మణవర్మ. డా యస్ సత్యనారాయణ రాజు లు పాల్గొని ఆమెను సత్కరించారు.

## శ్రీ రామలింగేశ్వరుని సన్నిధిలో పితాని వెంకట్ అన్నదానం



**పెనుమంట్ర, మే-06, (ప్రభాతవార్త)** మండలంలోని నత్తా రామేశ్వరంలో కొలువై ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి సన్నిధిలో పెళ్లిరోజు సందర్భంగా పితాని వెంకట సురేష్--నాగ సాహిత్య దంపతులు భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు దంపతులను ఘనంగా ఆహ్వానించి ఆశీర్వదించారు. అభిషేక అర్చకుడు సూరిబాబు ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, వైదిక మంత్రోచ్చారణల మధ్య అత్యంత శ్రద్ధగా నిర్వహించారు. అనంతరం తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వెంకట సురేష్--నాగ సాహిత్య దంపతులు భక్తులకు అన్నదానం ఘనంగా ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు.

## అకాల వర్షాల వల్ల రైతులకు భారీ నష్టం



**మొగల్తూరుమే 6 (ప్రభాతవార్త):** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షాలు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. ముఖ్యంగా మామిడి తోటలు, ఆక్వా సాగు, పంట పొలాలు తీవ్రంగా నష్టపోయినట్లు బుధవారం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాల కారణంగా మామిడి పండ్లు చెట్ల నుండి రాలిపోవడంతో పాటు, కోతకు సిద్ధంగా ఉన్న పంటలు నేలకూలిపోయాయి. ఆక్వా చెరువుల్లో నీటి మట్టం ఒక్కసారిగా పెరగడంతో చేపలు, రొయ్యల పెంపకానికి నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. ఇప్పటికే ఖర్చులు పెట్టి పంటలను సాగు చేసిన రైతులు, ఈ అకాల వర్షాలతో ఆర్థికంగా తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. అధికారులు స్పందించి, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి రైతులకు తగిన సహాయం అందించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొన్నారు.

## సభ్యుల జీవనోపాధికి రుణ ప్రణాళిక



**అగిరిపల్లి మే 6 ప్రభాతవార్త** మండలంలోని భోద్దనపల్లి పంచాయతీ లో స్వాతి వి. ఓ. లో అడ్వాన్స్ క్రెడిట్ లైవ్లీ హుడ్ ప్లాన్ ( ముందస్తు ఋణ జీవనోపాదుల ప్రణాళిక ) సమావేశం బయోమెట్రిక్ వర్క్ నిర్వహించడంజరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఎం దయాల రాజశేఖర్ ముఖ్య అతిధి పాల్గొనీ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులకు జీవనోపాధిని కల్పించాలని కూటమి ప్రభుత్వం ఈ రుణ ప్రణాళికను తీసుకువచ్చింది ఈ పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సభ్యులకు వ్యాపారాల నిమిత్తం గృహ అవసరాల నిమిత్తం రుణం ఎంత కావాలి ఎప్పుడు కావాలి ఏమి వ్యాపారం చేస్తున్నారు అన్న వివరాలను సేకరించి వారికి బ్యాంకు లింకేజీ శ్రీనిధి ఉన్నతి సిఐఎఫ్ మొదలగు పథకాల ద్వారా రుణాలు మంజూరు చేయడమే లక్ష్యంగా సభ్యుల నుండి బయోమెట్రిక్ తీసుకోవడం జరుగుతుంది. 2026-27 సంవత్సరానికి సంబంధించి రుణ ప్రణాళిక తయారు చేయటం జరిగింది. ఆగిరిపల్లి మండలం లో స్వయం సహాయక సంఘాల సభ్యులు వారికి కావలసిన రుణాల మొత్తం 90 కోట్లు ఈ సంవత్సరం కావాలని సభ్యులు బయోమెట్రిక్ ద్వారా కోరడం జరిగింది వీరికి ఈ సంవత్సరంలో ఈ 90 కోట్ల రుణాలను బ్యాంకు లింకేజీ ద్వారా స్త్రీనిధి ద్వారా సిఐఎఫ్ ద్వారా మండల సమైక్య నిధులు ద్వారా అందజేస్తామని తెలియజేశారు కార్యక్రమంలో సిసి హుసేన్ బీ ,వివోఏలు జ్యోతి, అల్లాబీ, దివ్య, నాగమణి, ధనలక్ష్మి, రమాదేవి, స్వప్న ,ఈనారిలు శోభారాణి , భవానీ , సౌజన్య , ఎస్ హెచ్ జిమహిళలు పాల్గొన్నారు .

### సోడదాసి శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన....
## చలి వేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే నాయకర్




**నరసాపురం మే 6 ప్రభాతవార్త** నరసాపురం 30వ వార్డు, చినమామిడిపల్లి లో గల న్యాయవాది సోడదాసి శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రం ను ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ, ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం ఎంతో అవసరమని, ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజలకు ఉపశమనం కలిగించే కార్యక్రమాలను ప్రోత్సహించడం మా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అలాగే కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నాయకర్ స్వయంగా ప్రజలకు మజ్జిగ మరియు తాగునీటిని పంపిణీ చేసి సేవా భావాన్ని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన టిడిపి బిజెపి నాయకులు, కార్యకర్తలు , జనసైనికులు , వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.




దెందులూరు నియోజకవర్గ సమస్యలపై ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తో కలిసి అధికారులతో ప్రతి సమస్య పైన సమీక్ష జరిపారు. పెండింగ్ సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.

**ఏలూరు ప్రభాత వార్త**

## రాచర్ల ఆశ్రమంలో నూతన షెడ్డును ప్రారంబించిన బేతిన గిరిధర్



**తాడేపల్లిగూడెం మే 6 (ప్రభాత వార్త)** పెంటపాడు మండలం రాచర్ల గ్రామంలోని రాధాకృష్ణ ఆశ్రమంలో సుమారుగా రెండు లక్షల పాతికవేలు రూపాయలతో నూతనంగా నిర్మించైనా షెడ్డుని తెలుగుదేశం నాయకులు బేతిన గిరిధర్, ఆశ్రమ సభ్యులు బుధవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో రాచర్ల, కృష్ణయ్యపాలెం గ్రామానికి చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు.

## 22ఎ కేసుల పరిష్కారానికి ఆధారాలతోరావాలి.
### -జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం, మే 6 (ప్రభాత వార్త) :** కలెక్టరేట్ లోని లో బుధవారం రెవెన్యూ క్లినిక్స్ కార్యక్రమాల భాగంగా అందిన భూ వివాదాల పరిష్కారంపై ప్రత్యేక విచారణ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగావిచారణ చేశారు.సంబంధిత మండల తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొని కేసులను సమగ్రంగా పరిశీలించారు. విచారణలో మొత్తం 15 (22-ఏ) కేసులను పరిశీలించగా, అందులో 7 కేసులు పూర్తిగా పరిష్కరమయ్యాయి . ఒక కేసు తిరస్కరించగా, మిగిలిన 7 కేసులు అవసరమైన పత్రాలు సమర్పించకపోవడంతో వచ్చే వారానికి వాయిదా వేయబడినట్లు కలెక్టర్ తెలిపారు. 22-ఏ కేసుల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, జిల్లాలో ప్రతివారం ప్రత్యేక విచారణ నిర్వహిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. రైతులు తమ కేసులకు సంబంధించిన అన్ని పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకుని హాజరవడం ద్వారా కేసుల పరిష్కారం వేగవంతం అవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు మరియు అర్జీదారులు పాల్గొన్నారు.

## నేడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి
### నివాళులు ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నాగరాణి



**భీమవరం మే 6 ప్రభాతవార్త** భీమవరం జె.పి. రోడ్డులోని అమరవీరుడు అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహం వద్ద మే 7న నిర్వహించనున్న అల్లూరి 102వ వర్ధంతి నివాళులఏర్పాట్లను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం పరిశీలించారు. ఉద్దరాజు ఆనంద్ ఫౌండేషన్ ,అల్లూరి సీతారామరాజు సేవా సమితి ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సుమారు రూ.25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆధునిక సదుపాయాలు అయిన డిజిటల్ స్క్రీన్, అలంకరణ లైటింగ్, ఆకర్షణీయమైన వాటర్ ఫౌంటెన్, మినరల్ వాటర్ ప్లాంట్ వంటి సదుపాయాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రతి ఏర్పాటును సవివరంగా పరిశీలిస్తూ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు సమయానికి పూర్తి చేయాలని అధికారులకు, నిర్వాహకులకు సూచనలు చేశారు. అల్లూరి 102వ వర్ధంతి నాడు ఘనంగా నివాళులు అర్పించేందుకు ప్రజలంతా పెద్ద సంఖ్యలో పాల్గొని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విగ్రహ కమిటీ అధ్యక్షులు ఉద్దరాజు విశ్వనాథరాజు, కార్యదర్శి కంతేటి వెంకట్రాజు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సభ్యులు గాదిరాజు సుబ్బరాజు, చేకూరి ఝాన్సీ లక్ష్మి, నందమూరి రాజేష్, కడలి వెంకటేశ్వరరావు, అల్లు శ్రీనివాసు, మైలబత్తుల ఐజాక్ బాబు, టివివి ప్రసాద్, సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలో
## ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు సన్మానం

### ప్రభుత్వ పాఠశాలలోనే చదవండి



**చాట్రాయి, మే 6 ప్రభాతవార్త** ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో చాట్రాయి మండల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారని మండల విద్యాశాఖ అధికారి ఎం శ్రీనివాస్ అన్నారు. పరిమిత వసతుల మధ్య కూడా పట్టుదలతో చదివి, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మార్కులు సాధించి మండల కీర్తిని చాటారన్నారు.మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన మొదటి ఐదుగురు విద్యార్థుల వివరాల ప్రకారంఅడ్డగట్ల కవిత,చిన్నంపేట 580, పరాస మధులత చిన్నంపేట 575, మట్టా జస్వంత్ చాట్రాయి 574, జి. ఉజ్వల కౌశిక్ పోలవరం 572, యు. నాగ మహేష్ పోలవరం 571 అని చెప్పారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి-1 మాసగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఏడాది మండల 80 శాతం ఉత్తీర్ణత నమోదైందు కావటం అభినందనీయమని అన్నారు. మండలంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు మండల రిసోర్స్ సెంటర్ నందు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుల ప్రత్యేక శిక్షణ, విద్యార్థుల కఠిన శ్రమ వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన కొనియాడారు.ముఖ్యంగా చిన్నంపేట, చాట్రాయి, పోలవరం గ్రామాల విద్యార్థులు టాప్-5లో నిలిచి మండల స్థాయిలోనే కాకుండా జిల్లా స్థాయిలో కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్నారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. మండల టాపర్గా నిలిచిన అడ్డగట్ల కవిత 580 మార్కులు సాధించడంపై స్థానికులు మరియు ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. తమ పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఇంతటి ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య , ఉపాద్యాయులు వెంకటేశ్వరరావు, ఆఫీస్ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రగతి మెట్టుకు ప్రధమ మెట్టు గ్రంథాలయమే..
### డాక్టర్ చినిమిల్లి శ్రీనివాస్



**నరసాపురం మే 6 ప్రభాతవార్త**
నరసాపురం ప్రధమ శ్రేణి శాఖా గ్రంధాలయం నందు బుధవారం వేసవి విజ్ఞాన తరగతులు సందర్భంగా హాజరైన విద్యార్థిని విద్యార్థులకు ఉదయం 8 గంటలకు పుస్తక పఠనం... వారి చేత కథలు చదివించడం మరియు కథ వ్రాయించడం చేశారు.9 గంటలకు డాక్టర్ చినమిల్లి శ్రీనివాస్ పిల్లలతో మాట్లాడుతూ తల్లిదండ్రులు ను గురువులను, పెద్దలను గౌరవించాలని అమ్మ గురించి మాట్లాడుతూ అమ్మ అనేది ప్రేమ త్యాగం ఆప్యాయతల కు ప్రతిరూపం పిల్లల కోసం తన సుఖాలనుకూడా త్యాగం చేస్తుంది మన జీవితంలో మొదటి గురువు మొదటి స్నేహితురాలు అమ్మే ఆమె ప్రేమకు ఎలాంటి ప్రతిఫలం ఇవ్వలేము అమ్మను గౌరవించడం ప్రతి పిల్లవాడి బాధ్యత అన్నారు.గ్రంథాలయం తల్లి లాంటిది ప్రతి ఒక్కరూ గ్రంథాలయం మెట్లు ఎక్కాలని పిలుపునిచ్చారు. 10 గంటలకు గ్రంథాలయ అభివృద్ధి కమిటి ఉపాధ్యక్షులు శాస్త్రవేత్త సుబ్బారావు.. పిల్లలకు ఇష్టమైన కథలు చెప్పి వేస విసెలవులను ఎలా ఉపయోగించుకోవాలి ముఖ్యంగా తీవ్రమైన ఎండ వడగల్పుల నుండి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం గురించి పిల్లలకు తెలియజేశారు రిసోర్స్ పర్సన్ సిహెచ్ శ్రీనివాస్ స్కూల్ అసిస్టెంట్ పిల్లలకు పుస్తకాల విశ్లేషణ మరియు వేమన పద్యాలు చిన్న చిన్న రైమ్స్ పై అవగాహన కల్పించారు... తదనంతరం స్నాక్స్ ఇవ్వడం జరిగిందిఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సెక్రటరీ భట్టిప్రోలు సత్యనారాయణ సూర్యం బాబు విద్యార్థిని విద్యార్థులు తదితరులు